క్లుప్తంగా

మేహాద్రి గెడ్డ వద్ద గజ తగాళ్లు


డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ జలాశయం వద్ద త్వరలో గజఈతగాళ్లు రానున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడం...పలువురు మృత్యువాత పడుతున్నారు. సమస్యను పలువురు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీదర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఇటీవల ఆయన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేహాద్రి గెడ్డ జలాశయంలో ప్రమాదాల నివారణకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ ఆమోదించారు. త్వరలో గజీతగాళ్ల మేహాద్రి గెడ్డ వద్ద అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తన అభ్యర్ధనను ఆమోదించిన మేయర్, కమిషనర్‌లకు జియ్యాని కృతజ్ఞతలు తెలిపారు.

స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసిన నాయకులు


స్వరూపానందేంద్ర సరస్వతికి పూలమాలవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని చినముషిడివాడలోని శారదాపీఠంలో బుధవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. రిషికేష్‌లో చాతుర్మాస దీక్షకు బయలుదేరి వెళ్లిన స్వామీజీకి అభినందనలు తెలియజేశారు. స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, అప్పలరాజు స్వామీజీని కలిసిన వారిలో ఉన్నారు.

గంట్ల శ్రీనుబాబుకు పితృ వియోగం


తాతారావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

సింహాచలం: వీజేఎఫ్ అధ్యక్షుడు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తండ్రి తాతారావు(74)బుధవారం తెల్లవారుజామున అస్వస్థతతో మృతి చెందారు. తాతారావు పెందుర్తి ఎంపీడీవో కార్యాలయంతో పాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలం పని చేశారు. సింహాచలంలోని స్వగృహం వద్ద తాతారావు పార్థివ దేహానికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ యాదగిరి శ్రీనివాసరావు, జీవీఎంసీ ఉద్యోగుల గుర్తింపు సంఘం అధ్యక్షుడు ఎమ్.ఆనందరావు, డాక్ యార్డు అసోసియేషన్ ప్రతినిధులు, అడవివరం గ్రామస్తులు నివాళులర్పించారు.

బృహద్వారాహిదేవిగా శ్రీమహాదుర్గ


బృహద్వారాహిదేవి అలంకరణలో మహాదుర్గ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో వారాహి నవ రాత్రి పూజలు కనులపండువగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా బుధవారం శ్రీమహాదుర్గను బృహద్వారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన నిర్వ హించారు. శత్రుస్తంభన, శత్రువశీకరణం చేయాలంటూ అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజానికి సంజీవని యోగా


యోగా ఆవశ్యకతను వివరిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు


పతంజలి యోగా విద్య ట్రైనింగ్ సెంటర్‌లో ..

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

సింహాచలం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జీవీఎంసీ 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పతంజలి యోగ విద్య ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం దాట్ల కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మన దేముడు మాట్లాడుతూ యోగా ద్వారా ఎన్నో మానసిక, శారీరక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పతంజలి యోగా విద్య ట్రెనింగ్ సెంటర్ ప్రతినిధులు , యోగ సభ్యులు పాల్గొన్నారు.

- జాతీయ యోగా దినోత్సవాన్ని అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాత గోశాల జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డుపై వాకర్లు యోగాసనాలు వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 101 డీజీ వాకర్ యు.సుభ హాజరయ్యారు. వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


అడవివరంలో యోగాసనాలు వేస్తున్న వాకర్స్

- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎస్ఆర్‌పురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అమృత్ సరోవర్ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి ప్రారంభించారు. ఉపాధి సిబ్బందికి యోగా విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అల్లూరి గణపతి సోమరాజు, ఈసీ రమేష్ టీఏ రవి పాల్గొన్నారు.
- అంతర్జాతీయ యెగా దినోత్సవాన్ని పెందుర్తిలోని కైట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు రామమూర్తి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగ మన శరీరంలో అంతర్భాగమని, ప్రతీ రోజూ అరగంటైనా యోగా చేయాలని సూచించారు. పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరగడానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.


ఎస్ఆర్‌పురంలో యోగ విశిష్టతను తెలియజేస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి

యోగాతో యోగం


సబ్బవరం జీహెచ్ఎస్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


పెందుర్తి కైట్స్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక యుగంలో నిద్ర లేచింది మొదలు పడుకునే వరకూ బతుకు జీవన పోరాటంలో విశ్రాంతి అనేది లేదన్నారు. ఎన్నో శారీరక, మానసిక,సామాజిక రుగ్మతలకు గురికావడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయంకాని జబ్బులకు గురవుతున్నామన్నారు. వీటన్నింటి నుంచి ఉపశమనం కలిగించే దివ్య ఔషధంగా యోగా పనిచేస్తుందని తెలిపారు.యోగా వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం,ప్రశాంతత లభిస్తుందని తెలినారు. యోగా గురువు సత్యనారాయణ పలు ఆసనాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు ఆర్. ప్రసాద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పలరాజుకు ఎమ్మెల్యే పరామర్శ


వద్దాది అప్పలరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం:విశాఖలోని బెహరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడివాడ అగ్రహారం సర్పంచ్ వద్దాది అప్పలరాజును బుధవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పడిపోవడంతో ఆయన గాయపడ్డారు.అప్పలరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వైద్యులకు సూచించారు.

కూర్మావతారంలో జగన్నాథుడు

అగనంపూడి: భక్తుల ఆరాధ్యదైవం జగన్నాథ స్వామిని బుధవారం కూర్మావతారంలో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొండయ్యవలస మహిళలు లలితా సహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం ఉమామహేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సమర, కమిటీ సభ్యులు జి.సత్యవతి, బి.సన్యాసమ్మ, దేవరాజు, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు


సదస్సుకు హాజరైన అధికారులు,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

- జెడ్పీటీసీ సభ్యుడు రాజు

పరవాడ: అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించి తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేయాలని జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై వెన్నలపాలెం కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో అర్హులెవరూ మిగిలిపోకుండా సంక్షేమ పథకాలు అందజేయాలని జెడ్పీటీసీ రాజు కోరారు. ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు పి.కనకారావు మాట్లాడుతూ జులై 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ లోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యలతో పాటు అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధి విధానాలు, ప్రజా సమస్యలను యాప్‌లో నమోదు చేయడం, వాటిని పరిష్కరించే విధానాలపై అవగాహన కల్పించారు. జనన, మరణ, కుల, ఆధాయ, వివాహ ధ్రువీకరణ పత్రాలు లేనివారు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వచ్చే వలంటీర్ల ద్వారా నమోదు చేసుకొని సర్టిఫికెట్లు ఉచితంగా జారీ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, పరవాడ, వెన్నలపాలెం, రావాడ, నాయుడుపాలెం, గొర్లివానిపాలెం, భర్నికం సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, ఎం.ఎస్.నాయుడు, కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, గొర్లి గోపీ అమ్మలు, పెదిశెట్టి పూజాశేఖర్, ఈవోఆర్డీ పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం:పెందుర్తి మండలం పులగానిపాలెంలో పెందుర్తి పోలీసులు నాలుగు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఎస్ఐ అసిరి తాత తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం పులగానిపాలెం దరి అయ్యప్పకాలనీ దగ్గర బైక్‌లో గంజాయి ఉంచి ముగ్గురు వ్యక్తులు ఆగి ఉన్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అయితే ఇద్దరిని పట్టుకోగా ఒకరు తప్పించుకు పోయాడు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్‌లో, బీకాం(జనరల్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ కెమిస్ట్రీ,ఫిజిక్స్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీలోగా సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ గ్రూపులె ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని ఆమె కోరారు.

వైభవంగా నిత్యకల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- తహసీల్దార్ సత్యనారాయణ


రిజిస్ట్రేషన్ పత్రాలు దొడ్డి అప్పారావుకు అందజేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తోందని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. దానిలో భాగంగానే రిజిస్ట్రేషన్ సేవలను కూడా సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. మండలంలోని బంగారమ్మపాలెం సచివాలయంలో బుధవారం తహసీల్దార్ బి. సత్యనారాయణ రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించారు.మండలంలో రాయపుర అగ్రహారం రెవెన్యూ భూములకు సంబంధించి మాజీ సర్పంచ్ దొడ్డి అప్పారావుకు రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్ అందజేశారు. అలాగే బంగారమ్మపాలెంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య,మండల సర్వేయర్ ఎం. శ్రీనివాసరావు,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష,అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్,వెల్ఫేర్ అసిస్టెంట్ గాయత్రి,సచివాలయ సర్వేయర్ శ్రీనివాస్,గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్,దొడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ!


మోటూరువానిపాలెం కూడలిలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పాన్ షాపు

పరవాడ: మండలంలో రావాడ పంచాయతీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు పెచ్చుమీరుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు క్షణాల్లో కబ్జాలకు పాల్పడుతున్నారు. రావాడ శివారు మోటూరువానిపాలెం కూడలిలో పరవాడ–యలమంచిలి రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబరు 53లోని విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి కంటైనర్ ఏర్పాటు చేశారు.అందులో పాన్‌షాపు నిర్వహిస్తున్నారు. ఆ పక్కన చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొన్నారు. కంటైనర్ పాన్ షాపు ఇరు వర్గాల మధ్య రాజకీయ దుమారం రేపుతుంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు ఆరోపించారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వైస్ ఎంపీపీ బందం హెచ్చరించారు. సమస్యను తహసీల్దార్ పి.కనకారావు వద్ద ప్రస్తావించగా కొత్తగా విధుల్లోకి చేరడం వల్ల సమస్య తన దృష్టికి రాలేదన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని చెప్పారు.

860వ రోజుకు ‘ఉక్కు’రిలే దీక్షలు


860వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేనివ్వరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి, కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

సబ్బవరం: జీ–20 కార్యక్రమాల్లో భాగంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక సమీకృతం– అభివృద్ధి విభాగం అనే అంశంపై దేశ వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం శాఖ మేనేజర్ బిర్లంగి రాజారావు చెప్పారు. సబ్బవరం పాఠశాలలో బుధవారం నిర్వహించిన పోటీలకు మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 16 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ఎంఈవో అప్పలరాజు తెలిపారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌లు బి. రాజారావు చేతులమీదుగా అందజేశారు. పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి–2 బీఎస్ఎన్ మూర్తి, ఇన్విజిలేటర్ ఆర్. ప్రసాద్,ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో దిశ పోలీసుల విచారణ


ఎన్ఏడీ జంక్షన్‌లో విచారణ చేస్తున్న దిశ డీఎస్పీ వివేకానంద్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

తుది దశకు చేరుకున్న మెట్ల నిర్మాణం


శ్రీవారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మెట్లు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నడుస్తూ చేరుకునేందుకు మెట్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. మెట్ల నిర్మాణం పూర్తికాగా వాటి చుట్టూ గోడ, పైన శ్లాబ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి చేరుకునేందుకు ఇప్పటికే సుందరమైన ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. కొండ దిగువ భాగం నుంచి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వరకు ఉన్న శ్రీవారి శంఖు, నామ, చక్రాల వరకు ఈ మెట్లు ఉంటాయి. అక్కడ నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో ఆలయం ఉండటంతో భక్తులు సులభంగానే చేరుకోవచ్చు. మొత్తం 240 మెట్లు, మధ్యమధ్యలో ఫ్లాట్‌ఫారం నిర్మిస్తున్నారు. తిరుపతి తరహాలో భక్తులకు ఎండతోగానీ, వర్షంతోగానీ ఇబ్బంది లేకుండా ఉండేదుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు క్షేమంగా ఆలయానికి చేరుకుని శ్రీ వారిని దర్శించుకోవచ్చు. మెట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, శ్రావణ మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఏఈవో జగన్‌మోహనాచార్యులు తెలిపారు. భక్తులు సులువుగా మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని శ్రీ వారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం


త్రోబాల్ పోటీల్లో 2కే20 జట్టు తరఫున మద్ది సర్వ్‌ను ఎదుర్కొంటున్న 2కే22జట్టు

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్బన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కే20 బ్యాచ్ జట్టుతో 2కే22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

పీఎం పాలెం: రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా నిఘా కొనసాగుతోందని, పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ శివరామరెడ్డి హెచ్చరించారు. పీఎం పాలెం, భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు మంగళవారం రాత్రి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిఘా నిరంతరం ఉంటుందని, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కూడా వెనకాడేది లేదని హెచ్చరించారు.